

ప్రోత్సాహం సరే..
పరిశ్రమలేవి?



మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోట

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- మొదట్లో సాగు చేసిన వారికి గెలల ఉత్పత్తి ప్రారంభం
- స్థానికంగా పరిశ్రమలు లేక ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు తరలింపు
- బీచుపల్లి, సంకిరెడ్డిపల్లిలలో క్రషింగ్ యూనిట్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన
- ముందుకు సాగని పనులు
- గెలల ఉత్పత్తి పెరిగితే.. అశ్వరావుపేటకు తరలించడం కష్టతరం

మహబూబ్‌నగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా.. సేకరించిన గెలలను క్రషింగ్ చేయడానికి పరిశ్రమల ఏర్పాటు ముందడుగు పడటం లేదు. విదేశాల నుంచి ఆయిల్ దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా అటు ప్రభుత్వానికి భారం తగ్గడంతో పాటు ఇటు రైతులకు లాభాలు వస్తాయనే ఉద్దేశంతో గడిచిన ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగును గవర్నమెంట్ ప్రోత్సహిస్తోంది. ఆయిల్‌పామ్ సాగు, క్రషింగ్ యూనిట్ల పనితీరు, మార్కెటింగ్, పంట సాగులో మెళకువలపై అవగాహన కోసం ఖమ్మం జిల్లాకు రైతులను పలుమార్లు క్షేత్ర స్థాయి పర్యటనలకు కూడా తీసుకెళ్లారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు సాధారణ పండ్ల తోటల నుంచి ఆయిల్ పామ్‌వైపు మళ్లారు. చీడపీడలు లేకపోవడం, సుదీర్ఘకాలం దిగుబడులు రావడం, మార్కెట్‌లో ధర బాగా ఉండటం, నీటి వినియోగం తక్కువగా ఉండటం, అంతర పంటలకు అవకాశం ఎక్కువగా ఉండటం వంటి కారణాలు కూడా రైతులను ఆకర్శితులను చేశాయి. ఆసక్తి ఉన్న రైతులకు మొక్కలను అందజేయడం కోసం పలు కంపెనీలకు బాధ్యతలను బైబ్యాక్ పద్ధతిలో అప్పగించారు. రైతులు సొంత డబ్బులతో ఎకరా విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపడితే రూ.55 వేల వరకు ఖర్చు వస్తుండగా.. ప్రభుత్వ సబ్సిడీతో అయితే కేవలం రూ.12 వేలు మాత్రమే అవుతోంది. రూ.193 ధర ఉన్న మొక్కను ప్రభుత్వం రూ.20కే అందిస్తోంది. ఎకరాకు సుమారు 57 మొక్కల వరకు నాటుకునే అవకాశం ఉంటుంది. ఏటా ఎకరాకు రూ.2,100 పెట్టుబడి సాయం, అంతర పంటల సాగుకు మరో రూ.2,100 సాయం ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, మిగతా వర్గాలకు 80 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. మిగతా ఆరుతడి పంటలకు డ్రిప్‌ను నిలిపేసి మరీ ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులకు వాటిని అందించడం గమనార్హం. నాటిన నుంచి మూడు సంవత్సరాలకు పంట ఉత్పత్తి మొదలై.. కనిష్ఠంగా 30 సంవత్సరాల వరకు ఏడాది పొడవునా దిగుబడి రావడం ఆయిల్‌పామ్ ప్రత్యేకత. ప్రస్తుతం మొదటి దశలో సాగుచేసిన వారికి గెలల ఉత్పత్తి మొదలైంది. మొదటి సంవత్సరం కావడంతో ఉత్పత్తి అయిన తక్కువ గెలలను సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు క్రషింగ్ కోసం తరలిస్తున్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను ధర రూ. 14,100గా ఉంది.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు ఆయిల్ పామ్‌ను 3,752 ఎకరాల విస్తీర్ణంలో సాగుచేశారు. మొదటి దశలో సాగు చేసిన 109 ఎకరాల్లో గెలల ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ సంవత్సరం 2,500 ఎకరాల్లో సాగును లక్ష్యంగా పెట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇప్పటి వరకు 6,203 ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది మూడు వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది లక్ష్యంలో 262 ఎకరాల్లో మొక్కలు నాటారు. మూడేళ్ల క్రితం సాగు చేసిన రైతులకు 76 ఎకరాల్లో 45 టన్నుల గెలల ఉత్పత్తి వచ్చింది. గతంలో పోటీపడి సాగు చేపట్టగా.. ప్రస్తుతం ఇక్కడ మందకొడిగా సాగవుతోంది. నారాయణపేట జిల్లాలో ఇప్పటివరకు 5,907 ఎకరాల్లో సాగు చేపట్టగా, 302.76 ఎకరాల్లో ఉత్పత్తి వచ్చింది. ఈ సంవత్సరం 2,500 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యం పెట్టుకోగా.. 216 ఎకరాల్లో మొక్కలు నాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 6,285 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగైంది. 82 ఎకరాల్లో గెలల ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ సంవత్సరం 2,800 ఎకరాల్లో మొక్కలను నాటలని లక్ష్యంగా పెట్టుకోగా.. 1,390 ఎకరాల్లో నాటారు. వనపర్తి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 5,064 ఎకరాల్లో సాగు చేయగా.. 120 ఎకరాల్లో గెలల ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ సంవత్సరం 2,800 ఎకరాల్లో సాగు చేపట్టాలని, లక్ష్యం పెట్టుకున్నారు. అన్ని జిల్లాల్లో వచ్చే ఏడాది నాటికి గెలల ఉత్పత్తి భారీగా పెరగనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 27,211 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవగా, 689 ఎకరాల్లో గెలల ఉత్పత్తి ప్రారంభమైంది.



చెట్టుకు కాసిన ఆయిల్‌పామ్ గెలలు

ఉమ్మడి జిల్లాలో మొక్కల పంపిణీ మెజారిటీ భాగం ప్రీయూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. వారు ఇక్కడ పరిశ్రమ స్థాపించి, రైతుల నుంచి సేకరించిన గెలలను క్రషింగ్ చేయాలి. అలాగే బీచుపల్లి ఆయిల్ మిల్‌ను గతంలో వేరుశనగ నూనె ఉత్పత్తికి వినియోగించగా.. తర్వాత కాలంలో మూతపడింది. దానిని పునరుద్ధరణ చేసి.. ఆయిల్‌పామ్ క్రషింగ్‌కు వినియోగించాలని ప్రణాళిక చేశారు. గద్వాల, నారాయణపేట జిల్లాకు సంబంధించి బీచుపల్లిలో, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు సంబంధించి వనపర్తి జిల్లాలో కంపెనీ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. గతేడాది సెప్టెంబరులో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బీచుపల్లి ఆయిల్ మిల్లుకు శంకుస్థాపన చేశారు. రూ.100 కోట్ల వ్యయంతో ఆయిల్‌ఫెడ్ ద్వారా ఈ పరిశ్రమను పునరుద్ధరించాలని నిర్ణయించారు. క్రషింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే రోజుకు 30 టన్నులు క్రషింగ్ చేసుకోవడానికి వీలుపడుతుంది. కానీ ఇప్పటివరకు శంకుస్థాపనకే పరిమితమయ్యారు. ఆచరణలో ఒక్క పని కూడా చేపట్టలేదు. అలాగే మిగతా మూడు జిల్లాలకు సంబంధించి వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ల కోసం సేకరించిన స్థలాన్ని ప్రీయూనిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి కేటాయించారు. రూ.100 కోట్ల పెట్టుబడితో అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అక్కడ కూడా ఇప్పటివరకు పనులు ప్రారంభించిన దాఖలాలు కనిపించడం లేదు. విద్యుత్ పనులు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. క్రషింగ్ యూనిట్ల నిర్మాణం ప్రారంభిస్తే పూర్తికావడానికి కనీసం ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. ఈ సమయంలో ఉత్పత్తి అయిన గెలలను రవాణా చేయడం కష్ట తరంగా ఉంటుంది. అలాంటిది ఇంకా పనులు ప్రారంభించకపోతే రైతులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సేకరణ కేంద్రాలు పెట్టి, గెలలను ఖమ్మం జిల్లా అశ్వరావుపేటకు తరలిస్తున్నారు. భవిష్యత్‌లో మాత్రం రవాణా, సేకరణలో అవస్థలు తప్పవు. ఇప్పటికే మార్కెటింగ్ సరిగా లేదనే కారణంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు. దీనికితోడు నిర్వహణ ఖర్చులను కూడా విడుదల చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పరిశ్రమల నిర్మాణం విషయంలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

నేడు డీసీసీబీ చైర్మన్ ఎన్నిక

- నిజాంపాషా రాజీనామాతో కొత్త చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్
- విష్ణువర్ధన్‌రెడ్డిని ఏకగ్రీవం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నం
- 12 మంది సభ్యులతో యాదగిరిగుట్ట శిబిరానికి..
- హస్తం గూటికి కోరమోని వెంకటయ్య
- వైస్ చైర్మన్‌గా కొనసాగేందుకు అవకాశం



డీసీసీబీ కార్యాలయం

మహబూబ్‌నగర్, ఆగస్టు 22: డీసీసీబీలో ఎన్నికల సందడి నెలకొంది. చైర్మన్‌గా ఉన్న నిజాంపాషా పదవికి రాజీనామా చేయడంతో రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. డీసీసీబీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చైర్మన్ ఎన్నిక జరుగనుంది. ఇదివరకు బీఆర్ఎస్ చేతిలో ఉన్న డీసీసీబీ పీఠాన్ని అధికార పార్టీ హస్తగతం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. 15 మంది సభ్యులున్న పాలక మండలిలో మెజారిటీ సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాలు దాదాపుగా ఫలించినట్లు తెలుస్తోంది. 12 మంది సభ్యులతో కాంగ్రెస్ గురువారం యాదగిరిగుట్ట క్యాంపునకు బయలుదేరింది. చైర్మన్ కోసం పానగల్ పీఏసీఎస్ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న కోరమోని వెంకటయ్య రెండేళ్లుగా ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా పార్టీ మారి చైర్మన్ దక్కించుకోవాలని ప్రయత్నం చేసినా, పార్టీ విష్ణువర్ధన్‌రెడ్డికే మద్దతు తెలిపినట్లు ప్రచారం సాగుతోంది. కోరమోని వెంకటయ్యను పార్టీలో చేర్చుకుని వైస్ చైర్మన్‌గా కొనసాగించాలని నిర్ణయించారు. ఆయన కూడా కాంగ్రెస్ క్యాంప్‌లోనే ఉన్నట్లు సమాచారం. ఇక షాద్‌నగర్ పరిధిలోని మేకగూడ పీఏసీఎస్ చైర్మన్ మంజులారెడ్డి కాంగ్రెస్ మద్దతుతో చైర్మన్ కోసం ప్రయత్నాలు చేసినా.. పార్టీ మరొకరికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించడంతో ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. చైర్మన్‌గా ఎన్నికైన వారు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పదవిలో ఉంటారు. అంటే పాలకమండలి గడువు మరో ఆరు నెలలు మాత్రమే ఉంది. అయితే ఎన్నికలు జరగకపోతే పాలకమండలి గడువు పొడగించే అవకాశం ఉంటుందని పోటీలో ఉన్న వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. చైర్మన్‌ను ఎన్నుకోవాలంటే డీసీసీబీ డైరెక్టర్లుగా ఉన్న 15 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనాలి. ఎనిమిది మంది సభ్యులు ఎవరికి మద్దతు ఇస్తారో వారు చైర్మన్‌గా ఎన్నికవుతారు. 15 మంది డైరెక్టర్లలో గతంలో ఎన్నికలు జరిగినప్పుడు 12 మంది బీఆర్ఎస్‌కు చెందిన వాళ్లు ఎన్నికవగా, ముగ్గురు కాంగ్రెస్ మద్దతుదారులు ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ డీసీసీబీ పీఠం దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- డీసీసీబీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 9-11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు నామినేషన్ల పరిశీలన
- మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణ
- మధ్యాహ్నం 2:30 గంటలకు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- సాయంత్రం 5:30 గంటలకు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

మధ్యాహ్నానికే మూత

- రోగులకు అందని ఆయుర్వేద వైద్యశాలల సేవలు
- మధ్యాహ్నం రెండు గంటలకే బంద్ చేస్తున్న కేంద్రాలు
- వనపర్తి జిల్లాలో 14 వైద్యశాలలకు నలుగురే డాక్టర్లు
- మిగతా చోట్ల ఫార్మసిస్టులతో నిర్వహణ
- అందుబాటులో లేని మందులు



వనపర్తి మండలం పెద్దగూడెంలో మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఆయుర్వేద వైద్యశాల

వనపర్తి రూరల్, ఆగస్టు 22: వనపర్తి జిల్లాలో ఆయుర్వేద ఔషధాలయాలు రోజు రోజుకు మూతపడుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాల్సిన వైద్యులు, ఫార్మసిస్టులు మధ్యాహ్నం రెండు గంటలకే ఔషధాలయాలకు తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. దాంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వనపర్తి జిల్లాలో 14 ఔషధాలయాలు ఉన్నాయి. అందులో తొమ్మిది రెగ్యులర్, ఐదు ఏఎన్‌హెచ్‌ఎం కింద ఉన్నాయి. ఆత్మకూరు, అజ్జకోలు, పెబ్బేరు, పెద్దగూడెం, పెద్దమందడి, ఘణపూర్, కల్వరాల, గోపాల్‌పేట, నాగపూర్‌లలో రెగ్యులర్‌గా, కొత్తకోట, వీపనగండ్ల, కడుకుంట్ల, కమలొద్దీన్‌పూర్, రేవల్లిలో ఏఎన్‌హెచ్‌ఎం కింద ఉన్నాయి. అజ్జకోలు, పెబ్బేరు, గోపాల్‌పేట, ఘణపూర్‌లలో మాత్రమే ఔషధాలయాల్లో వైద్యులు ఉన్నారు. మిగతా చోట్ల ఫార్మసిస్టులు కొనసాగిస్తున్నారు. వైద్యులు ఉన్న చోట మందులు పూర్తి స్థాయిలో లేకపోగా, ఫార్మసిస్టులు ఉన్న చోట మందులు అసలుకే లేవు. ఈ ఔషధాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నాలుగు చోట్ల మాత్రమే వైద్యులు ఉండటం వంటి కారణాల వల్ల మధ్యాహ్నానికే మూసేస్తున్నారు. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలోని ఆయుర్వేద ఔషధాలయంలో నాలుగు సంవత్సరాల నుంచి వైద్యుడు లేరు. రెండేళ్లుగా అటెండర్‌తో నిర్వహించగా, అతనూ బదిలీపై జడ్చర్లకు వెళ్లాడు. తర్వాత రెండేళ్లుగా మూతపడింది. 15 రోజుల కిందట ఫార్మసిస్టును నియమించారు. ఆమె కూడా మధ్యాహ్నం రెండు గంటల వరకే ఉంటుండటంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు.

వైద్యులు త్వరలోనే అందుబాటులోకి వస్తారు

ఆయుర్వేదిక్ వైద్యులు తక్కువగా ఉన్నమాట వాస్తవమే. కానీ వైద్యశాలలు మూతపడకుండా ప్రతీ చోట ఒక ఫార్మసిస్టును నియమించారు. అందరూ సకాలంలో దావఖానాలకు వెళ్తున్నారు. ఇకనుంచి అన్ని గ్రామాల్లో ఆయుర్వేదిక్ దవాఖానాలపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

\- ఒమరెల్లి, ఆయుర్వేదిక్ జిల్లా ఇన్‌చార్జి, ఆయుర్వేదిక్ వైద్యుడు

లారీ కిందపడి

తల్లీ కూతురి మృతి

- లారీని బైక్ ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం
- వాహనంపై నుంచి కిందపడిన ఇద్దరు
- వారిపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం





రేఖ, సాత్విక(ఫైల్)

జడ్చర్ల, ఆగస్టు 22: లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో తల్లీ కూతురు మృతురు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్-గోప్లాపూర్ గ్రామాల మధ్య చోటు గురువారం చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల మండలం లింగపేట గ్రామానికి చెందిన చెన్నకేశవులు, రేఖ(27) భార్యాభర్తలు. వారికి స్వాతిక(3) కూతురు ఉంది. చెన్నకేశవులు జడ్చర్ల సమీపంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా రేఖ కుమార్తె సాత్వికతో కలిసి తన సోదరుడికి రాఖీ కట్టేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఎదిరపల్లికి వెళ్లింది. లింగంపేటలో గురువారం బోనాల పండుగ సందర్భంగా మరిదితో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. గంగాపూర్-గోప్లాపూర్ మధ్యలో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా, బైక్‌పై నుంచి తల్లీ కూతుళ్లు రేఖ, సాత్విక కింద పడ్డారు. రోడ్డుపై పడిన వారి పైనుంచి లారీ వెళ్లడంతో ఇద్దరి తలలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న లింగంపేట గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గంగాపూర్-లింగంపేట మధ్యలో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయని చర్చించుకున్నారు. కొందరు మృత్యువాత పడగా, మరెందరో తీవ్రంగా గాయపడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అరగంట పాటు గ్రామస్థులు రాస్తారోకో చేశారు. వారిని పోలీసులు సముదాయించి, ఆందోళన విరమింపజేశారు. అనంతరం మృతదేహాలను జడ్చర్ల ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

తాడోపేడో తేల్చుకుంటాం

- రుణమాఫీ విషయంలో మోసం చేసిన కాంగ్రెస్
- పాలమూరు ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, అవి అమలు చేసే వరకు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామని రైతులకు పిలుపునిచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో రైతులతో కలిసి శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ సగం మందికి కూడా చేయలేదన్నారు. రకరకాల షరతులతో కోతలు విధిస్తున్నారని, రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న వారు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించిన తరువాతే మాఫీ అవుతుందని చెప్పడం దుర్మార్గమన్నారు. రూ.2 లక్షలకు పైన ఉంటే మీకేం బాధ అని, ముందు మీరు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ ఏకమై ప్రభుత్వం మెడలు వంచాలన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన తరహాలో హామీల అమలు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా రూ.15 వేలు పెంచుతానని చెప్పి, వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు అవుతున్నా దాని గురించే మాట్లాడటం లేదన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో రైతు సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అర్థమైందన్నారు. రైతులు మళ్లీ వ్యవసాయం వదిలి ముంబాయి, పూణె వలస వెళ్లే పరిస్థితి ఏర్పండిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గంజి ఎంకన్న, కోరమోని నర్సింహులు, గోపాల్ యాదవ్, బాలరాజు, కొండ లక్ష్మయ్య, అనంతరెడ్డి, గణేష్, రహమాన్, కరుణాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, పటేల్‌ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, ప్రభాకర్, జావెద్‌బేగ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వివాహిత మృతి

- ఆత్మకూరు మండలం తిప్పడంపల్లిలో ఘటన

ఆత్మకూరు, ఆగస్టు 22 : పాముకాటుతో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన సువర్ణమ్మ (38)కు ఎనిమిదేళ్ల క్రితం అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన రాములుతో వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవపడి తన సొంత గ్రామమైన తిప్పడంపల్లి గ్రామంలో మేకలు కాచుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల తన పెద్ద నాన్న చనిపోవడంతో పది రోజుల కార్యానికి ఇంటి పక్కనే ఉన్న గుడిసెను శుభ్రం చేసే క్రమంలో పాము కాటు వేసింది. దీంతో ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం నిర్వహిస్తున్న క్రమంలోనే మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



సువర్ణమ్మ (ఫైల్)

కూలి డబ్బు అడిగితే దాడి

- రెండు చేతులు విరిగిపోయిన భలాన్‌పల్లి తండా రమేష్

తాడూరు, ఆగస్టు 22 : పొద్దస్తమానం చేసిన పనికి సంబంధించి కూలి డబ్బులు అడిగేందుకు వెళ్లినంత మాత్రాన్నే డబ్బులు ఇవ్వకపోగా కర్రతో దాడి చేయడంతో రమేష్ అనే కూలీకి తీవ్ర గాయాలై రెండు చేతులు విరిగిపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్‌పల్లి తండాలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. భలాన్‌పల్లి తండాకు చెందిన రమేష్ ఆయన భార్య సుజాత కలిసి అదే తండాకు చెందిన కృష్ణయ్య, శారద దంపతుల వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లేవారు. గత నెల 19వ తేదీ రాత్రి సమయంలో కృష్ణయ్య ఇంటికెళ్లిన రమేష్ కూలి డబ్బులు రూ. 900 ఇవ్వాలని అడిగాడు. ఈ సమయంలో ఏందంటూ రైతు ప్రశ్నించాడు. ఇంతలోనే మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. కృష్ణయ్య దంపతుల దాడితో రమేష్‌కు తీవ్ర గాయాలతో పాటు రెండు చేతులు విరిగాయి. దీంతో బాధితుడు ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకున్నాడు. సమస్య పరిష్కారానికి ఇరువర్గాలతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో రమేష్ భార్య సుజాత ఫిర్యాదు మేరకు గత నెల 15వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణయ్యకు పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. జరిగిన ఈ ఘటనపై ఎస్‌ఐ మహేష్‌ను వివరణ కోరగా ఇరువర్గాల వారిని కూర్చోబెట్టి మాట్లాడిన సమయంలో రాజీకి వచ్చినట్లు చెప్పారు. రమేష్‌పై దాడి చేసినందుకుగాను కృష్ణయ్య పూర్తిస్థాయి వైద్య ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారన్నారు. దీంతో అతనికి స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సి వచ్చిందన్నారు.



దాడిలో విరిగిన రమేష్ రెండు చేతులు

చోరీ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

గోపాల్‌పేట, ఆగస్టు 22 : దొంగతనం కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... ఈ సంవత్సరం మెదటి నెలలో 23 తేదీన మండల కేంద్రలోని బండపల్లి స్కూల్‌లో అదే కాలనీ కి చెందిన మండ్ల జనార్దన్ చోరీకి పాల్పడ్డారు. గురువారం రోజు న్యాయస్థానంలో తొమ్మిదిమంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో న్యాయాధికారి ఎనిమిది నెలల జైలుశిక్ష, రూ.200లు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

కొత్తకోట, ఆగస్టు 22 : మండలంలోని ముమ్మళపల్లి గ్రామ శివారు లోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. గురువారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న వాహనం ఢీ కొనడంతో శవం కొంత భాగం నుజ్జునుజ్జైందని, పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాజా బహదూర్ వెంకట్రామారెడ్డికి ఘన నివాళి

కొత్తకోట, ఆగస్టు 22 : కొత్తకోట చౌరస్తాలో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి జయంతి వేడుకలను రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గొల్లబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి



రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

ఆత్మకూరు, ఆగస్టు 22: రుణమాఫీకి అర్హత ఉండి మాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తెలిపారు. మండలంలో 9,359 రైతులకు గాను 88 కోట్ల 62 లక్షలకు పైగా రుణమాఫీ వర్తించిందని తెలిపారు. అర్హత ఉండి మాఫీ కానీ రైతులు గురువారం నాటికి 220 మంది రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రేషన్ కార్డులో పేరు నమోదు కాని రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్‌తో నమోదు చేసు కొని రైతులు, ఉమ్మడి కుటుంబంలో ఉండే ఈ మధ్యకాలంలో వేర్వేరుగా ఉంటూ రేషన్ కార్డు లేని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు పట్టాదారు పాసు బుక్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ కాపీలతో మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. రేషన్ కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగ పరిరక్షణకు నిబద్ధతతో కృషి

- టీఎల్ఎఫ్ చైర్మన్ కత్తి వెంకటస్వామి
- ఈనెల 27న సమాలోచన సదస్సు



కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 22 : విద్యారంగ సమస్యలపై తెలంగాణ లెక్చరర్స్ ఫోరం నిబద్ధతతో పని చేస్తుందని ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జలజం జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం టీఎల్ఎఫ్ పని చేసిందని గుర్తు చేశారు. ఉచిత విద్య, వైద్యం కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు. ఈ నెల 27న టీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని వి.వి. కన్వెన్షన్ హాల్‌లో సమాలోచన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి రమేష్‌గౌడ్, నాయకులు వేణు, ఉమ్మడి జిల్లా ప్రైవేట్ పాఠశాల అధ్యక్షుడు బి.లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు వంశీరెడ్డి, డాక్టర్ అబ్దుల్ ఫరీద్, అరుణ్‌కుమార్, మచ్చేందర్, వెంకట్‌రెడ్డి, జహీర్ అక్తర్ పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

- సంస్థ ఎండీ సజ్జనార్ ప్రశంస



ప్రయాణికురాలికి నగదు, ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కొల్లాపూర్, ఆగస్టు 22 : విధి నిర్వహణలో నిబద్ధత చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులను కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ ఉమా శంకర్ ప్రశంసించారు. కొల్లాపూర్ డిపోకు చెందిన బస్సులో బుధవారం కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు జడ్చర్ల బస్టాండ్‌లో తన బ్యాగును మరిచి బస్సు దిగి వెళ్లిపోయారు. తాను మర్చిపోయిన బ్యాగు కోసం జడ్చర్ల బస్ స్టేషన్ మేనేజర్‌ను ఆశ్రయించగా వారు ఆ బస్సు యొక్క కండక్టర్ శ్రీనివాసులు 213673, డ్రైవర్ నాగరాజు 152852కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఫోన్ సమాచారంతో కండక్టర్ , డ్రైవర్ ఆ బ్యాగును గమనించి భద్రపరిచి ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఆ ప్యాసింజర్‌కు బ్యాగును అప్పగించారు. బ్యాగులో ఉన్న లక్ష రూపాయలు, ఒక సెల్‌ఫోన్, పాయింట్ కంట్రోలర్, హమీద్ (153214) పోలీసు వారి సమక్షంలో ఎంజీబీఎస్‌లో బాధితులకు అందజేశారు. అందుకు బాధితులు డ్రైవర్, కండక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సంస్థ ఎండీ సజ్జనార్ ఉద్యోగస్తులను అభినందించారు. వారితో పాటు స్థానిక రీజనల్ మేనేజర్ శ్రీదేవి, డిపో మేనేజర్ ఉమా శంకర్ ఉద్యోగస్తులను అభినందించారు.

రుణమాఫీపై మోసపు మాటలు మానుకోవాలి

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 22 : రైతు రుణమాఫీపై మోసపు ప్రకటనలు మానుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నాగం జనార్దన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలం చెంది ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రకటించిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నాగర్‌కర్నూల్ సింగిల్ విండో బ్యాంకు ద్వారా 1645 మంది రైతులు రుణాలు తీసుకోగా వారిలో 984 మంది రైతులకు నేటికి రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. అదేవిధంగా తాడూరు సింగిల్ విండోలో 816 మందికి గాను 396 మందికి, తెలకపల్లిలో 2324కు గాను 1242 మందికి, బిజినేపల్లిలో 628 మందికి గాను 414 మందికి, తిమ్మాజిపేటలో 350 మందికి గాను 231 మందికి రుణమాఫీ అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీలను పక్కనపెట్టి రైతులకు క్షమాపణ చెప్పడంతో పాటు ప్రశ్నించే ప్రతిపక్షాలు, జర్నలిస్టులపై దాడులకు దిగడం సరికాదని ఆయన మండి పడ్డారు. బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, లక్ష్మయ్య, తిమ్మాజీపేట పాండు, బాలాగౌడ్, సల్మాన్, భీముడు, వెంకటస్వామి, వెంకటయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగా టోర్నీలో పతకాలు సాధించాలి

- జిల్లా యోగా సంఘం సలహాదారుడు చెన్నవీరయ్య
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు



యోగా ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22 : రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా యోగా సంఘం సలహాదారుడు చెన్నవీరయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల, మహిళ, పురుషుల జట్ల ఎంపికలను గురువారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా యోగా సంఘం సలహాదారుడు చెన్నవీరయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో చదువులో చురుకుగా రాణిస్తారని, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది జాతీయ స్థాయిలో రాణించారన్నారు. కార్యక్రమంలో యోగా సంఘం ప్రతినిధులు బాలయ్య, శ్రీనివాసులు, రామచందర్, సూర్యప్రకాష్, అరుణజ్యోతి, నర్సింహులు, రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ఊట్కూర్, ఆగస్టు 22 : అనుమతి లేకుండా మక్తల్ మండలం దాసర్‌దొడ్డి గ్రామం నుంచి దామరగిద్దకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం మండలంలోని మల్లెపల్లి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్స్ బృందం, ఊట్కూర్ పోలీసులు దాడులు నిర్వహించి, పట్టుకున్నారు. ఈ సందర్భంగా గుడిగండ్ల గ్రామం రామకృష్ణకు చెందిన టిప్పర్‌గా గుర్తించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఓనర్ రామకృష్ణతో పాటు డ్రైవర్ యాకుబ్ అలీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

గ్రామీణ రోడ్లను పట్టించుకునే వారేరీ..?

- అధ్వానంగా ఇటిక్యాల - చాగాపురం రహదారి
- పెద్దవాగుకు వరద వస్తే నిలిచిపోనున్న రాకపోకలు



బురదమయంగా మారిన ఇటిక్యాల - చాగాపురం రహదారి



ప్రమాదకరంగా మారిన చాగాపురం రోడ్డు

ఇటిక్యాల, ఆగస్టు 22 : దశాబ్దాలు గడుస్తున్నా గ్రామీణ రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సమస్యను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకు మాత్రం తిప్పలు తప్పడం లేదని ఇటిక్యాల మండల వాసులు వాపోతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఇటిక్యాల వయా చాగాపురం మీదుగా శాంతినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిని చూసి వాహన చోదకులు బాధపడుతున్నారు. ఈ మార్గంలో రాత్రివేళ ప్రయాణించాలంటే భయంగా ఉంటుందని.. రోడ్డుపై గోతులు కనిపించక ద్విచక్ర వాహనచోదకులు అనేకసార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్ నుంచి రోడ్డు పూర్తిగా పాడైందని, ఆటోల్లో కూర్చోలేకపోతున్నామని కుదుపులకు మహిళలు, వృద్ధులు అస్వస్థతకు గురైన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు ఎప్పటికి బాగుపడునో అంటూ తిట్టుకుంటూ లోలోపలే కుమిలిపోతున్నారు. గత 25 సంవత్సరాల క్రితం రోడ్డు ఇబ్బందులు తొలగించాలని మాజీ ఎంపీపీ చాగాపురం నాగన్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన అధికారులను రోడ్డు వెంట నడిపించి గ్రామీణ ప్రజలు అవస్థలు వివరించారు. ఆ వెంటనే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి మరమ్మతులు చేసి వదిలివేయగా నేటివరకు ఇక ఆ రోడ్డు గురించి పట్టించుకునే వారు లేరని వారు వాపోతున్నారు. ఇటిక్యాల నుంచి చాగాపురం మీదుగా శాంతినగర్‌కు 20 కిలోమీటర్ల రోడ్డు దుస్థితి అలాగే ఉందని, అంచెలవారీగా అయినా రోడ్డు వేసి రాకపోకలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఇటిక్యాల నుంచి చాగాపురం వరకు వెళ్లే బీటీ రోడ్డు దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డుకు నిధులు మంజూరైతే నిర్మాణం పనులు చేపడతాం. మండలం లో ఇది ప్రధాన రోడ్డు కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుం ది. గతంలో వేసిన బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులకు తెలిపాం.

- పాండురంగారావు, ఏఈ

ఆదమరిస్తే అంతే

- చెక్‌డ్యాల వద్ద చిన్నారులకు పొంచి ఉన్న ముప్పు
- తల్లిదండ్రులూ జర భద్రం



బండర్‌పల్లి చెక్‌డ్యాం దిగువన నీటిలో బాలురు



బండర్‌పల్లి చెక్‌డ్యాం వద్ద జలపాతం

చిన్నచింతకుంట, ఆగస్టు 22 : వర్షాలకు వాగులు, వంకల్లో నీరు నిండుగా ప్రవహిస్తున్నది. వాగుల్లో నిర్మించిన చెక్‌డ్యాంల వద్ద జలపాతం కనువిందు చేస్తున్నది. ఇదంతా బాగానే ఉన్నా, పర్యాటకులకు కొంత ప్రమాదం కూడా పొంచి ఉంది. ప్రధానంగా మండలంలోని బండర్‌పల్లి నుంచి అల్లీపురం వరకు ఊకచెట్టువాగు విస్తరించి ఉంది. వాగులో బండర్‌పల్లి, ఏదులాపూర్, ముచ్చింతల, పల్లమర్రి, కురుమూర్తి, అల్లీపురం తదితర చోట్ల వాగులో భారీ ఎత్తున చెక్‌డ్యాల నిర్మించారు. బండర్‌పల్లి సమీపంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చెక్‌డ్యాంలోకి ఎగువ కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరింది. దాంతో చెక్‌డ్యాంపైన నీరు ప్రవహిస్తుండటంతో, చూపరులను జలపాతం ఎంతో కనువిందు చేస్తున్నది. చూసేందుకు వెళ్లిన చిన్నారులు, పిల్లలను కూడా వారి తల్లిదండ్రులు జలపాతం వద్దకు తీసుకువెళ్లి, చెక్‌డ్యాం దిగువన గల నీటి కుంటల్లో స్నానాలు చేయిస్తూ, ఈత ఆడుతున్నారు. ఇలా నీటికుంటల్లో స్నానాలు చేసే సమయంలోనే పెద్ద ప్రమాద పొంచి ఉంది. రాతి బండలు ఉండటం, నీరు నిండుగా ఉండి, బండలు కనిపించక పోవటంతో పైనుంచి నీటికుంటల్లో దూకే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు గాయాల పాలయేయ పరిస్థితి ఉంది. తెలియకుండా వరద నీటిలోనూ కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. తల్లిదండ్రులు నీటి ప్రవాహం వద్దకు తీసుకువెళ్లే సమయంలో పిల్లలను గమనిస్తూ ఉండి, జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే ఇక తల్లిదండ్రులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా, ప్రమాదం పొంచి ఉంది.

భక్తిశ్రద్ధలతో బోనాలు



ఖిల్లాఘణపురంలో రథాన్ని లాగుతున్న గొర్రె పొట్టేళ్లు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 22: మండల కేంద్రంలో గురువారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధాన రహదారుల ముఖద్వారం దగ్గర వేపాకు తోరణాలు కట్టడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలను ఊరేగించారు. గొర్రెపోతుల బండిపై పోచమ్మ అమ్మవారిని ఊరేగింపును తిలకించేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. మహిళలు బోనం కుండలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. జోగిని వేషధారణలో బోనం ఎత్తిన మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బైకును ఢీకొన్న ఇన్నోవా

- ముగ్గురికి గాయాలు

మానవపాడు, ఆగస్టు 22 : బైకును ఇన్నోవా కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయిచూర్ జిల్లా బలిగేరకు చెందిన ఉరుకుంద, చిట్టెమ్మ, మనోజ్‌లు మండలంలో నిజల్లాపురం గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. మానవపాడు స్టేజీ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తున్న వీరి బైక్‌ను కర్నూల్ వైపు నుంచి వచ్చిన ఇన్నోవా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారని ఎస్సై తెలిపారు.

డెంగీ కేసులను ఎలీసా పరీక్షలతోనే నిర్ధారించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 22 : ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్లందరు కిట్ మెథడ్ చేసి రోగాలు నిర్ధారించొద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. 'డెంగీ' పేరుతో డబ్బులు వసూల్ శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ సిద్దప్ప స్పందించారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో గద్వాల ప్రైవేట్ హెల్త్ ఫెసిలిటి నిర్వహించే డాక్టర్లకు, డయాగ్నోస్టిక్ సెంటర్స్ ల్యాబ్‌లు నిర్వహించే టెక్నీషియన్లకు సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప మాట్లాడుతూ ప్రైవే టు ల్యాబ్ టెక్నీషియన్లందరూ కిట్ మెథడ్ ద్వారా పరీక్షలు చేసి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదిత ర వ్యాధులను నిర్ధారించొద్దన్నారు. కిట్ మెథడ్ ద్వా రా పాజిటివ్ వచ్చిన కేసులను టీ-హబ్‌కు పంపిస్తే అక్కడ డెంగీ కేసుకు ఎలీసా, మలేరియా కేసుకు స్లైడ్ మెథడ్, చికున్‌గున్యాకు ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేసి నిర్ధారిస్తారన్నారు. అలా చేసినవి మాత్రమే పాజిటివ్ కేసులుగా గుర్తించాలే తప్ప కిట్ మెథడ్ చేసినవి కాదన్నారు. అదేవిధంగా ప్రతీ ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో కచ్చితంగా పరీక్ష పేరు, ప్రైస్‌లిస్ట్ డిస్‌ప్లే చేయాలన్నారు. ప్రతీరోజు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, పాలీ క్లినిక్స్, ల్యాబ్, డయాగ్నోస్టిక్ సెంటర్స్ సీజనల్ వ్యాధులకు సంబంధించి కేసుల వివరాలను జిల్లా వైద్యఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజు, డాక్టర్ తస్నీర్ రిజ్వానా, డిప్యూటీ డెమో మధుసూదన్‌రెడ్డి, సీహెచ్‌వో రామకృష్ణుడు, ఏఎస్‌వో తిరుమలేష్‌రెడ్డి, ఎపిడాలమిస్ట్ సుమిత్‌చంద్రారెడ్డి, డీడీఎం రామాంజనేయులు, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య తదితరులు ఉన్నారు.

చిన్నారి గొంతుకోసిందెవరు ?

- వీడని మిస్టరీ.. అమ్మాయి నోరు విప్పితేనే బయటపడనున్న నిజం
- సీసీ ఫుటేజీలో అనుమానితులెవరూ కనిపించలేదంటున్న పోలీసులు
- గేటు బయట దాడి చేస్తే ఇంట్లో రక్తపుమరకలు ఉండటంపై అనుమానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 22 : చిన్నారి గొంతు కోసిన ఘటనలో ఏం జరిగిందనే విషయంలో పోలీసులు మల్లాగుల్లాలు పడుతున్నారు. అసలు దాడి ఇంటి బయట జరిగిందా ? ఇంట్లో జరిగిందా ? బయట దాడి జరిగితే బయట ఏమాత్రం రక్తపు మరకలు లేకుండా ఇంట్లోనే ఎందుకున్నాయి ? సీసీ ఫుటేజీలో దాడి చేసిన సమయంలో అనుమానితులెవరూ కనిపించకపోవడంతో అసలు పాప గొంతుకోసిందెవరు అన్న విషయంలో పోలీసులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. పట్టణంలోని శ్రీనివాస కాలనీలో బుధవారం సాయంత్రం సిరి అనే పదకొండేళ్ల చిన్నారి గొంతు కోసిన ఘటన తెలిసిందే. ఈ కేసును పోలీసులు పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి గొంతుకోసి గుర్తు తెలియని వ్యక్తి పరారైనట్లు ప్రచారం జరిగినా అందుకు సంబంధించిన ఆనవాళ్లేమీ కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. కాలనీలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు ఒకటికి పదిసార్లు పరిశీలించారు. చిన్నారి పార్క్‌నుంచి ఇంటికి వెళుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొద్ది నిమిషాలకే దాడి జరిగిందని చెబుతున్నారు. ఆ సమయంలో సీసీటీవీలను పరిశీలించగా ఒక ఆటో మాత్రమే వెళ్లింది. ఆటోను గుర్తించి ఆటో డ్రైవర్‌ను పిలిపించి విచారించారు. ఒక ప్యాసింజర్‌ను దించి వెళుతుంటూ అదే సమయంలో పాపకు గాయమైందని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే అదే ఆటోలో తీసుకెళ్లారు. ఆ సమయంలో వ్యక్తులు కానీ, మరో వాహనం కానీ ఆ దారిలో వెళ్లకపోవడంతో అసలు దాడి చేసిందెవరనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. గేటు బయట దాడి చేస్తే కనీసం చుక్క రక్తమైనా అక్కడ పడి ఉండాలి. ఇంట్లో తప్ప బయట ఎక్కడా రక్తపు మరకల ఆనవాళ్లు లేవు.

ఈ కేసులో ఇక కోలుకుంటు న్న పాప నోరు విప్పితేనే అసలు నిజం బయటపడ నుంది. పాప కోలుకున్నాక అసలు విషయాలు తెలుస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

చిక్కుడు తోటపై గడ్డి మందు పిచికారి

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

లింగాల, ఆగస్టు 22 : గుర్తు తెలియని వ్యక్తులు చిక్కుడు తోటకు గడ్డి మందు పిచికారి చేసిన సంఘటనలో రైతుకు తీవ్ర నష్టం జరిగింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని దత్తారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు రాజాల్‌రెడ్డి కుటుంబం కూరగాయలను పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. కూరగాయలను సాగు చేసి వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తుండటంతో గ్రామానికి చెందిన కొందరు జీర్ణించుకోలేకపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు ఒక ఎకరా చిక్కుడు తోటకు గడ్డి మందు పిచికారి చేయడంతో అట్టి పంట చేతికి రాకుండా ఎండిపోయిందని రైతు తెలిపారు. పంట నష్టం రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. ఇట్టి విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు. తనను ఆదుకుని నష్టపర్చిన వ్యక్తులను గుర్తించి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరారు.

రెండు బైక్‌లు, ఆటోను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, పలువురికి గాయాలు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 22 : కారు అదుపుతప్పి రెండు బైకులతో పాటు, ఒక ఆటోను ఢీ కొనడంతో పలువురికి గాయాలు కాగా, ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలో హైదరాబాద్ ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేటకు చెందిన ప్రదీప్ దేవరకొండ నుంచి అచ్చంపేటకు వస్తుండగా అచ్చంపేట సమీపంలోకి రాగానే ఎదురుగా ఉప్పునుంతల మండల లత్తిపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేష్ బైకును ఢీకొనబోవడంతో అతను తప్పించబోయి కింద పడ్డాడు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కారు డ్రైవర్ ఎదురుగా వస్తున్న ఆటోను వెనకాల వస్తున్న బైకును ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. మండల పరిధిలోని బొల్గట్‌పల్లి గ్రామానికి చెందిన వాల్యాయి బాలరాజు (30) బైకు పైనుంచి పడి తలకు గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉంది. ఆరునెలల కిత్రమే వివాహమైంది. సంఘటన స్థలానికి ఎమ్మెల్యే సతీమణి అనురాధ చేరుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

గుర్తు తెలియని శవం లభ్యం

భూత్పూర్, ఆగస్టు 22 : మహబూబ్‌నగర్ జిల్లా మండల కేంద్రమైన భూత్పూర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైందని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు.. మండల కేంద్రంలోని మునిరంగస్వామి దేవాలయం దగ్గర 44వ జాతీయ రహదారి పక్కన ఈ నెల 18వ తేదీన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. శవాన్ని పరిశీలించి జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుని దగ్గర ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా రెండు రోజులుగా పోలీసులు సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేశారు. అయిన ఆచూకీ లభించకపోవడంతో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

జగతిని జాగృతం చేసేది జానపదం

మహమ్మదాబాద్, ఆగస్టు 22 : జగతిని జాగృతం చేసేది జానపదం అని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, జానపద కళాకారుడు ఆచార్య చీగిపల్లి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రపంచ జానపద దినోత్సవం పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులకు జానపద సాహిత్యం గురించి వివరించారు. ఎల్లప్పుడూ సమాజాన్ని తట్టిలేపేది జానపద కళారూపాలు అన్నారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి మాడ పుష్పలత, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సంతోష్, ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు సంగీత, శ్యామల, శ్రీదేవి, హరిత పాల్గొన్నారు.

సనాతన హిందూ సంప్రదాయ విలువలను కాపాడుదాం



అయిజలో ఆలయాలను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ

అయిజ, ఆగస్టు 22 : సనాతన హిందూ సంప్రదాయ విలువలను కాపాడుదామని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. పర్యవేక్షణలో భాగంగా గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని గుంతరామేశ్వరాలయం, భీమరాయస్వామి, వీరభద్రస్వామి, శివాలయం, రంగనాథ ఆలయాలను ఆమె పరిశీలించారు. ఆయా ఆలయాల్లో జరుగుతున్న పూజా విధానాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చిన ప్రతీ భక్తుడికి విలువనిస్తూ గౌరవించాలని పూజారికి తెలిపారు. ప్రతిరోజు భగవంతుడికి దూప, దీప నైవేద్యం సమర్పించాలన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు. హిందూ సనాతన ధర్మ విలువలను, సాంప్రదాయాలను ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత మనదే అన్నారు. ప్రతీ వ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు చక్రవర్తి ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందాలి

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, ఆగస్టు 22 : నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన గంగయ్యకు రూ.2 లక్షల 50వేల ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందించి మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే ఆరోగ్య శ్రీని రూ.10 లక్షలకు పెంచిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. చికిత్స కోసం నిమ్స్‌లో చేరిన కోయిలకొండ మండలం పారుపల్లి గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఫోన్‌లో నిమ్స్ సూపరింటెండెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట కాంగ్రెస్ నాయకులు కే.శివకుమార్‌రెడ్డి, నాయకులు రామస్వామి, యాదయ్య, ఆశన్నగౌడ్ పాల్గొన్నారు.

వెంటనే రెగ్యులరైజ్ చేసుకోవాలి

- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచన


భూత్పూర్ మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

భూత్పూర్, ఆగస్టు 22 : అర్హులైన వారు ఎల్‌ఆర్‌ఎస్‌ను వెంటనే రెగ్యులరైజ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. గురువారం ఆయన భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రెవెన్యూ, నీటి పారుదలశాఖ, మునిసిపల్ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజ్ సర్వే ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. 2020 సంవత్సరంలో ఎంత మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారో, వారందరికీ రెగ్యులరైజ్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశ కల్పించిందని గుర్తు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే మునిసిపల్ శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సురేందర్ రెడ్డి, రెవెన్యూ ఆర్‌ఐలు వెంకటేష్, భానుచందర్, నీటిపారుదల, మునిసిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రి తనిఖీ

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 22 : వాతావరణంలో మార్పులు, వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే రోగులకు మరిన్ని జబ్బులు రాకుండా జనరల్ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని కొన్ని వార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలలో శానిటేషన్ పరిస్థితిని పరిశీలించారు. శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. భోజనామృత ప్రాంతంలో, విజయ డెయిరీ షాపు ప్రాంతంలో చెత్తా చెదారం ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా పార్కు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై మునిసిపల్ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవోలు డాక్టర్ జరినాభాను, డాక్టర్ శ్వేత, డాక్టర్ ఎసిన్, డాక్టర్ శిరీష, సీహెచ్‌వో రామునాయక్ ఉన్నారు.

కార్మికులకు హక్కులు వర్తించవా ?

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్యయ్య


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

జడ్చర్ల ఆగస్టు 22 : 'మునిసిపాలిటీలో శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు మనుషులు కారా.. వీరికి రాజ్యాంగ హక్కులు వర్తించవా' అంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్యయ్య ప్రశ్నించారు. జడ్చర్లలోని అంబేడ్కర్ కళాభవన్ వద్ద మునిసిపల్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సత్యయ్య మాట్లాడుతూ 17 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం నిరసనలు, ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నా మునిసిపల్ కమిషనర్ రాజయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మిక సంఘాల నాయకులపై కక్ష గట్టి అసత్యపు ఆరోపణలు చేయడం కమిషనర్‌కు తగదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు వెంకటేష్, కేశవులు, అంజమ్మ, కృష్ణ, భీమమ్మ, యాదయ్య, మహేష్, స్వరూప పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

కోయిలకొండ, ఆగస్టు 22 : వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో కాశప్ప సూచించారు. అమ్మ పేరుతో మొక్కలు నాటాలన్న కార్యక్రమంలో భాగంగా కోయిలకొండ, శేరివెంకటాపూర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అమ్మ పేరుతో మొక్క నాటి అమ్మలా సంరక్షించాలని కోరారు. ఇది వరకు నాటిన ప్రతీ మొక్క సంరక్షించేందుకు ఉపాధి సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం విజయకుమారి, ఏపీవో నర్సయ్య, ఐకేపీ సీసీలు మల్లేష్, కేశవులు, బద్రునాయక్, టీఏ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి సీపీఎస్ బ్లాక్ డేను విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 22 : సీపీఎస్ విధానాన్ని అమలు చేసి 2014 ఆగస్టు 28 రోజును రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్ డే పాటించాలని నిర్ణయించినట్లు టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎం చంద్రకాంత్ తెలిపారు. ఇందు కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నిరసన కార్యక్రమానికి టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ హాజరు అవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షా ఇరవైవేల మంది జీవితాలు చరమాంకంలో ఆర్థిక భద్రత లేకుండా నట్టేట ముంచిందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, కార్తీక్, కృష్ణకుమార్ గౌడ్, రాజేష్, వెంకటేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోనె మైసమ్మ దేవతకు బోనాలు


బోనాలతో ఆలయం చుట్టూ తిరుగుతున్న మహిళలు

మిడ్జిల్, ఆగస్టు 22 : మండలంలోని వల్లభరావుపల్లి గ్రామంలోని గోనె మైసమ్మ బోనాలను వేడుకలను గ్రామ పెద్దల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ బోనాలతో ఆలయానికి వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుకల సందర్భంగా బైండ్ల వారి కథ పలువురిని ఆకట్టుకుంది. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సామర్థ్యాలు ఎక్కువ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 22 : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సాధారణ పిల్లలకంటే సామర్థ్యాలు ఎక్కువగా ఉంటాయని డీఈవో రవీందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం ఆవరణలో నిర్వహించిన అలిమ్కో ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల గుర్తింపు, పిల్లల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అంగవైకల్యం కలిగిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రతీ మండలంలో భవిత కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరానికి 17 మండలాలకు చెందిన ఆరు ఏళ్ల నుంచి 18ఏళ్ల దివ్యాంగ పిల్లలు హాజరయ్యారు. ఇందులో 296 మంది పిల్లలను ప్రత్యేక అవసరాలు పిల్లలుగా గుర్తించారు. కార్యక్రమంలో సీఎంవో బైకాని బాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, మెడికల్ అధికారి డాక్టర్ అస్గల్‌అలీ పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తున్న కాంగ్రెస్

- **షరతుల్లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలి**
- **ధర్నాలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**
- **జడ్చర్ల, నవాబ్‌పేట, మిడ్జిల్‌లలోనూ బీఆర్‌ఎస్ నిరసన**
- **జడ్చర్లలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

దేవరకద్ర, ఆగస్టు 22 : రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగ్గిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రమైన దేవరకద్రలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు 44 శాతమే రుణమాఫీ చేసి మిగతా 56శాతం రైతులకు రుణమాఫీ చేయకుండా వదిలేసిందని దుయ్యబట్టారు. రుణమాఫీ కాని రైతులు ఆందోళనకు గురవుతూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పాత చెక్కులను ఇప్పుడు ఎనిమిది నెలల తరువాత పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన పథకాలలో ఒక్క చెక్కు కూడా పంపిణీ చేయలేదని విమర్శించారు. గ్రామాల్లో రుణమాఫీ కాని రైతులు ఎవరైనా ఉంటే వివరాలను అందించాలని, వాటిని సేకరించి గవర్నర్‌కు పంపిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు రైతులకు రుణమాఫీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు శ్రీకాంత్ యాదవ్, బాలరాజు, వివిధ మండలాల మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

జడ్చర్లలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం

జడ్చర్ల : షరతులు లేకుండా ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జడ్చర్లలో తహసీల్దార్ కార్యాలయం ముందు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీ. లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ధర్నా చేపట్టారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారంటూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు తీసుకురాగ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, రజిని సాయిచంద్, పిట్టల మురళి, సుదర్శన్ గౌడ్, రఘుపతి రెడ్డి, రామ్మోహన్, శంకర్ నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్

నవాబ్‌పేట : రైతు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసం చేస్తున్నదని సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, మాజీ జడ్పీటీసీ ముత్యాల రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ప్రసంగించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, అనంతయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాంప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ తాహెర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, మెండె శ్రీను, గోపాల్‌గౌడ్, యాదయ్య రఘు గుప్త, భోజయ్య చారి, రాజు నాయక్, చెన్నయ్య పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మిడ్జిల్ : ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ ఏ లాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కల్వకుర్తి, జడ్చర్ల ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, సుకుమార్, జగన్‌గౌడ్, నారాయణ్‌రెడ్డి, వెంకటయ్య, గంజి శేఖర్, భాస్కరాచారి, శ్రీనివాసులు, భాస్కర్‌నాయక్, వరుణ్‌రాజ్, భద్రయ్య, బంగారు, భీంరాజు, సురేష్, ప్రశాంత్, జహీర్, సైదులు, సత్యనారాయణ, నర్సింహ, రవీంద్ర, రాఘవేందర్, రాములు, రాజు, నాయకులు ఉన్నారు.


ధర్నా అనంతరం దేవరకద్ర తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల


జడ్చర్లలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మాడెమోని నర్సింహులు

● హన్వాడ : షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేసి రైతు భరోసా నిధులు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం హన్వాడ తహసీల్దార్ కార్యాలయం ముందు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు రాములు, జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు రేషన్‌కార్డు లింక్ లేకుండా అందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం నాయకులు రాములు, బాల్‌రెడ్డి, వెంకట్‌రాములు, బాలయ్య, వెంకటయ్య, నర్సిములు, రైతులు పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ : గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నంచర్ల గేట్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ మాచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భిక్షపతి, పెంట్యానాయక్, రఘు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనాయక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, నీలేష్, వెంకట్‌రెడ్డి, పుట్టి శంకరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే రుణమాఫీ

- హన్వాడ రైతు వేదికలో రైతుల ధ్రువపత్రాలను పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి


హన్వాడ రైతు వేదిక వద్ద దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

హన్వాడ, ఆగస్టు 22 : రుణమాఫీ కాని రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా నంబరుతో సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే అలాంటి రైతులకు రుణమాఫీ అవుతుందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం హన్వాడ రైతువేదికలో రుణమాఫీపై స్వీకరిస్తున్న ఫిర్యాదుల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు అక్కడి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎంత రుణం తీసుకున్నావు, ఎంత మాఫీ అయ్యింది, రుణమాఫీ ఎందుకు కాలేదు, సమస్య ఎందుకు వచ్చిందని అనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హన్వాడ ఎస్‌బీఐని సందర్శించి బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. ఎంత మందికి రుణమాఫీ అయ్యిందని వివరాలు అడగగా ఇప్పటికే 50 శాతం రైతుల అకౌంట్లలో జమ చేసినట్లు బ్యాంకు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగతా వారికి వారంలో పూర్తి చేస్తామని బ్యాంక్ మేనేజర్ వివరించారు. కలెక్టర్ అక్కడి నుంచి హన్వాడ కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొక్కలు నాటారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆమె వెంట పీడీ నర్సిములు, ఏడీవో వెంకటేష్, ఎంపీడీవో యశోద, ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద ఫీజు వివరాలు ప్రదర్శించాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా అందించే సేవలు, ఫీజుల వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సీజన్ పూర్తయ్యే వరకు సీజనల్ వ్యాధులపై ప్రైవేట్ ఆసుపత్రులు ప్రతీ రోజు సమాచారం ఇవ్వాలని, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. గురువారం ఆమె సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సీజనల్ వ్యాధులు, డెంగీ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప రోగులను ఆసుపత్రులలో చేర్చుకోవద్దని ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 60 శాతం ఆసు పత్రులు వారు ఇస్తున్న సేవల, ఫీజులను ఆసుపత్రుల వద్ద ప్రదర్శిస్తున్నారని, తక్కిన వారి ద్వారా సైతం వివరాలను ప్రదర్శించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.పద్మశ్రీ, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ సంపత్, ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి డాక్టర్ శామ్యూల్, డాక్టర్ నిషాంత్, ఇతర డాక్టర్లు, ప్రభుత్వ డాక్టర్లు శశికాంత్, భాస్కర్ నాయక్, డాక్టర్ రఫీ పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలి

మహబూబ్ నగర్ (కలెక్టరేట్) : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి, తహసీల్దారులను ఆదేశించారు. ధరణి, ప్రజావాణి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర అంశాలపై గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, ఎల్‌డీఎం కాల్వ భాస్కర్, కలెక్టరేట్ ఏవో శంకర్, కార్యాలయ విభాగాల అధిపతులు, తహసీల్దార్లు వీసీకి హాజరయ్యారు.

ఇంటాక్ క్విజ్ పోటీల్లో కూచూర్ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నవాబ్‌పేట, ఆగస్టు 22 : ది ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ హార్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'భారతీయ కళా సాంస్కృతిక వారసత్వం' అనే అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని కూచూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల టాపర్‌గా కూచూర్ విద్యార్థి భరత్‌కుమార్ నిలవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శుల నియామకం

కోయిలకొండ, ఆగస్టు 22 : మండలంలోని ఖాజీపూర్, కోయిలకొండ గ్రామ పంచాయతీ కార్యదర్శులు కృష్ణయ్య, రమేష్ వివిధ కారణాలతో సెలవులో వెళ్లడంతో వారి స్థానంలో కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీవో కాశప్ప తెలిపారు. లింగాల్‌చేడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సమ్మద్‌కు కోయిలకొండ పంచాయతీ, అనంతాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు ఖాజీపూర్ గ్రామ పంచాయతీలకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

హన్వాడ, ఆగస్టు 22 : సమస్యల పరిష్కారం కోసం విశ్రాంత ఉద్యోగుల సంఘం పని చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అన్నారు. గురువారం హన్వాడలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పభుత్వ కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు, వృద్ధుల కోసం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణ, గణపతి, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

- స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 22 : విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఎంచుకుని ముందుసాగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తన స్వంత నిధులతో ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం పయనీర్ ఈఏపీ-సెట్ పేరున ఇంజనీరింగ్, మెడికల్ కోచింగ్‌కై ఏర్పాటు చేసిన ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలంటే విద్యార్థులు పెద్ద లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వంద మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఈవో ఉమామహేశ్వర్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవంత చారి, రాజేందర్, గోపాల్, భీమ్‌రెడ్డి, రిషి విద్యాలయం అధినేత రిషి వెంకటయ్య, ప్రతిభ జూనియర్ కళాశాల ప్రతినిధి వెంకటరామయ్య పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

మహబూబ్‌నగర్ టౌన్ : పాల్కొండ తండాలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ పర్వత సంజీవరాయ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయ అర్చకులు ఎమెల్యేకు వేద ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాముడికి నమ్మిన బంటు ఆంజనేయస్వామి అని, ఆయనను నమ్మిన వారికి ఆ రాముడి ఆశీస్సులు కూడా మెండుగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త రఘునాయక్ రుడావత్, సుధాకర్‌రెడ్డి, ఫకీరానాయక్, బలరాంనాయక్, గోపింద్‌నాయక్, ఖాజానాయక్ పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి పంచామృతాభిషేకం

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 22 : రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలో భాగంగా పాలమూరులోని మరిమళగిరి రాఘవేంద్రస్వామి దేవాలయంలో గురువారం స్వామికి విశేష ఫల పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామవళి పూజ నిర్వహించారు. రాఘవేంద్రస్వామిని భజనలు, కోలాటాలతో రథోత్సవంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దివాన్‌జీ గురురాజా చారి, రాము శ్రీరాఘవేంద్ర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

36 మునిసిపల్ దుకాణాలకు టెండర్

- దరఖాస్తుకు నేడు చివరి తేది, 28న వేలంపాట

మహబూబ్‌నగర్, ఆగస్టు 22 : పాలమూరు పురపాలిక పరిధిలోని 36 అద్దె దుకాణాలకు వేలంపాట నిర్వహించనున్నారు. న్యూటౌన్, క్లాక్‌టవర్, పద్మావతికాలనీలలో ఉన్న ఈ దుకాణాలకు టెండర్లు నిర్వహించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణకు శుక్రవారం చివరితేది. దరఖాస్తు చేసుకునేవాళ్లు రూ.1.50 లక్షల డీడీ ముందుగానే తీయాల్సి ఉంటుంది. ఒక్కో దుకాణానికి నెలకు రూ.4500 నుంచి 9500 వరకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.4500కాగా, జనరల్‌కు రూ.8000-9659 వరకు అద్దె నిర్ణయించారు. దీనిపై ఈనెల 28న వేలం పాట పాడి ఎవరు ఎక్కువ వేలం పాడితే వారికి దుకాణాలను కేటాయించనున్నారు. వేలంలో దుకాణం దక్కించుకున్న వారికి రూ.1.50లక్షల డీడీని తిరిగి ఇవ్వబడదు.

కేజీబీవీని పరిశీలించిన ఎంపీడీవో

నవాబ్‌పేట, ఆగస్టు 22 : ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానం చేరుకోవాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీని పరిశీలించి, అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఎంపీడీవో వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

నవాబ్‌పేట, ఆగస్టు 22 : మండలంలోని రుద్రారం గ్రామంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఆదేశానుసారం పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ లక్ష్మీకృష్ణగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి చదువుపై దృష్టి సారించి లక్ష్యంవైపు అడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దరాములు, వెంకట్రాములు, యాదయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు గ్రామస్థుల విరాళం

చిన్నచింతకుంట, ఆగస్టు 22 : మండలంలోని ఉంద్యాల గ్రామంలో గురువారం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్థులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఎస్‌ఐ శేఖర్ సమక్షంలో రూ.లక్ష విరాళం సీసీ కెమెరాలకు గాను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా, దొంగతనాలు, దోపిడీలు వంటి వాటిపై గట్టి నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామస్థులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావటం ఎంతో అభినందించాల్సిన విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు జైపాల్‌రెడ్డి, సత్యశీలారెడ్డి, మోయిన్, వేణుగోపాల్‌శెట్టి, నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డికి ఘన నివాళి


రాజాబహదూర్ వెంకట్రామిరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మునిసిపల్ చైర్మన్

పాలమూరు, ఆగస్టు 22 : రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి కులమతాలకు అతీతంగా విద్యారంగాన్ని వ్యాప్తిచేసిన మహనీయుడని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి 155వ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని గ్రీన్ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించి, హాస్టల్స్ ఏర్పాటు చేసి ఎందరికో భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో పాలమూరు రెడ్డిసేవా సమితి ప్రధాన కార్యదర్శి వి.రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జి.వెంకట్రామిరెడ్డి, యస్.సురేందర్‌రెడ్డి, న్యాయవాది యస్.మల్లారెడ్డి, టీఎన్‌జీవోస్ మాజీ అధ్యక్షుడు జి.రాజేందర్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, రావుల అనంతరెడ్డి, వెంకటేష్ ప్రశాంత్, పాపారాయుడు, వెంకట్రాములు, సేవా సమితి కార్యదర్శి టి.పరమేశ్వర్‌రెడ్డి, యు.కోటేశ్వరరెడ్డి, పి.రాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉదయశ్రీ, వనజ, గీత, స్వరూప, అనిత, శోభ, లత, శశికళ, కవిత, పారిజాత, పి.గిరిధర్‌రెడ్డి, మద్ది అనంతరెడ్డి, మద్ది యాదిరెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి పాల్గొన్నారు.